

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... “ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను” అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్ళే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్ళే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో ఉన్న పాస్ పోర్టుపై "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి, నీకు ఎదురే లేదు అని ఏదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచ్చెక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

## ఇల్లు అలకగానే..!

సమ్మర్ హాలిడేస్ అయిపోయి బళ్ళు తెరవడంతో తలితండ్రులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. పిల్లలని వాళ్ళ టీచర్లకు అప్పగించి తిరిగి జన జీవన స్రవంతిలో కలుస్తున్నారు. దాదాపు ఉగాది నుండి ఉన్న డ్రై డేస్ అయిపోయినట్టే ఇక. శ్రావణ మాసంతో మొదలైన పండుగల హడావిడి ఇక అలా కొనసాగుతూనే ఉంటుంది. వేసుకునే సందర్భాలు లేక పెట్టెల్లో ఉండిపోయి, ఇండియాలో అవుట్ డేట్ అయిపోవస్తున్న ఫ్యాషన్లన్నీ బయటికి తీస్తున్నారు జనాలు. ఇండియన్ కమ్యూనిటీలకు 'ఫెస్టు'లని, 'ఫెయిర్' లనీ బోలెడు హడావిడి. నిన్నగాక మొన్న పెళ్ళిచేసుకుని వచ్చిన ఒక పిల్ల వరలక్ష్మివ్రతం చేసుకుని వాయనానికి పిలిచింది. నేను కూడా ఉత్సాహంగా క్రితం ఇండియా ట్రిప్పులో ముచ్చటపడి కొనుక్కుని భద్రంగా దాచిన ఉప్పాడ చీర కట్టుకుని వెళ్ళా. వాయనంతో పాటు ఒక తప్పనిసరి ఫోటో. ఫోటోల కోసం పూజలో, పూజల కోసం ఫొటోలో అర్ధం కాని అయోమయంలో ఉంది

వాతావరణం అక్కడ. తిరిగి నేను ఇంటికి వెళ్ళేలోపు ఇన్స్టాలోకి ఎక్కేసాను. కట్టక కట్టక చీరకడితే ఆ చీరని నేసిన వాడు కూడా పోల్చలేని విధంగా దాన్ని తొక్కితొక్కి నా చేతుల్లో నరంలా సాగుతున్న నా బుడ్డి పిల్లతో నేను, 'పౌట్ ఫేస్' తో వాయనం ఇస్తున్న ఆ పిల్ల. పైగా #withmycuteముత్తైదువ, #cantbelievesheisamother అని హ్యాష్ టాగ్లు ఒకటి, పుండు మీద కారంలాగా. పోన్లే పెళ్ళైన కొత్త కదూ '#మోస్ట్ ఎక్సయిటెడ్' ఫీల్ అవుతోంది పిల్ల అనుకుని వదిలేసా, సీనియర్స్ నవ్వే ఒక వంకర నవ్వు నవ్వుకుని.

చిన్నప్పుడు పండుగల కోసం చూసిన ఎదురుచూపులు వేరు. ఇప్పుడు పండగంటే వచ్చే ఆలోచనలు వేరు. పండుగలు 'జరుపుకోవడం' వేరు! 'జరిపించడం' వేరు! అని మాబాగా తెలిసొస్తోంది. బాల్యంలో పండుగంటే లేవగానే తలంట్లు, కొత్త బట్టలు, శుభ్రంగా పండుగ వాసనలు వచ్చే ఇల్లు, చుట్టుపక్కల వాతావరణాలు. కాసేపు అలా ఓపికగా చేతులు జోడించి అమ్మ పక్కన కూర్చుంటే చాలు ముందుకి వచ్చే పులిహోర – పరమాన్నాలూ, బొబ్బట్లు – ఆవడలు. ప్రతి పండక్కి ప్రత్యేకమైన కథలు, నమ్మకాలూ, రుచులూ. ఇవన్నీ మళ్ళీ ఇంకొక పండుగ ఎప్పుడా? అనే ఆశని, ఆసక్తిని రేకెత్తిస్తూ ఉండగా ఉండగా, ప్రతి పండుగా వచ్చి పోతూ ఇలా ఒక్కసారిగా పెద్దరికాన్ని తెచ్చేసింది. పెద్దరికం ఊరికే రాదు కదా... వస్తూ వస్తూ బోలెడు ప్రశ్నలను, సందేహాలను వెంటపెట్టుకొచ్చి అప్పటిదాకా వున్న అమాయకమైన నమ్మకాలని నిలదీస్తుంది. అబ్బురంగా వెంకటేశ్వర స్వామిని చూస్తూ ఒకానొక అలౌకిక ఆనందముద్రలోకి వెళ్తుండగా, నిర్దాక్షిణ్యంగా మెడపట్టి గెంటివేయపడితే, 'అన్నీ నీవే తండ్రీ!' అని పెట్టుకున్న నమ్మకాన్ని ఎవరో కదిల్చివేసినట్టు.

పండుగ వస్తుందంటే ఇప్పుడు గుర్తొచ్చేది ఒకే ఒకటి... పని పని. ఒక్కళ్ళమే ఇళ్ళు శుభ్రం చేసుకుని, సర్దుకుని, అనుకున్నవన్నీ వండుకుని, స్వయంగా అన్నీ సమకూర్చుకుంటే తెలిసొస్తోంది అసలు కథ. మరొక తరానికి పండుగలలో వున్న ఆనందం పంచడం మొదలుపెడితే కానీ తెలీలేదు, ఎంత మంది పెద్దలు ఎన్ని విధాలుగా కష్టపడితే మేము పండుగలను ఆనందించామో అని. వట్టి హూనం చేసుకుని మాయలు – మంత్రాల సినిమాలో లాగా అన్నీ మాకు అమర్చిపెట్టిన తల్లులందరికి సాష్టాంగ దండ ప్రణామాలు పెట్టాలి అసలు. అన్నేసి ఓపికలు ఎలా ఉండేవో మరి వాళ్ళకి. లేక ఆ చిన్నతనపు అమాయకత్వంలో మా సంతోషపు స్వార్థంలో అమ్మ శ్రమ, కష్టం మేము పట్టించుకోలేదేమో! బాగా బుద్ధి వస్తోంది ఇప్పుడు.

పైగా ఇక్కడ ఉంటే మనసుని కూడదీసుకుని చేసుకోవాలి పండుగలు. అన్నిటా సందేహాలే. అక్కడ పగలైతే ఇక్కడ రాత్రి. ఘడియల్లో తేడా. తిథుల్లో మిగులు తగులు అని సందేహాలు. వచ్చిన కొత్తల్లో గందరగోళంగా ఉండేది. ఒకరు ఈరోజు దీపావళి అంటే, ఇంకొకరు రేపు అనేవాళ్ళు. మళ్ళీ ఇంత పెద్ద దేశంలో వేరు వేరు టైంజోన్స్ కాబట్టి ఇక్కడా తేడాలు. చిన్నా చితకా పండుగలు అసలు గమనింపులోకే వచ్చేవి కావు. మంచి ఎండాకాలంలో కృష్ణాష్టమి, వినాయక చవితి వస్తాయి. పూజకి అన్నీ సిద్ధం చేసుకుని వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమ పాదే అని పుస్తకంలో చెప్పినట్టు చదువుతుండగా మొదలవుతుంది మథనం... తరువాత ఇది జంబూ ద్వీపం కాదుకదా? భరత ఖండం కాదు కదా? అని. అక్కడికీ అమెరికా ఖండే అనుకుని పూజ ముగించేయడమే. కానీ మనసులో ఏదో వెలితి.

భారత దేశంలో అయితే ప్రతి పండుగని ఆయా ఋతువులే మోసుకొచ్చేస్తాయి. శివరాత్రి రాగానే 'శివ శివా' అని చలి పారిపోతుంది అంటే నిజమే కదా అనిపిస్తుంది, వెనువెంటనే వచ్చే వేడి గాలులకు. తొలకరి జల్లులకి మొదలయ్యే పులకింతలా ఉంటుంది శ్రావణ మాసంతో వచ్చే పండుగల శోభ. ధనుర్మాసపు పొగ మంచులో వెచ్చగా చలికాచుకునే భోగి మంటలు ఎలా మరువగలము. ఇలా ప్రతి పండుగకి ప్రకృతి ప్రత్యేకంగా ముస్తాబయినట్టు ఉంటుంది. లేదా ప్రకృతిలో వచ్చే మార్పులకనుగుణంగానే పండుగలు జరిపే ఆచారం ఏర్పాటు చేసినట్టు అనిపిస్తుంది.

ఇక్కడికి వచ్చిన కొత్తల్లో వినాయక చవితికి మొదటి సారి ఇష్టంగా 'ఇండియా మార్కెట్ ' నుండి మూరెడు పొడవు బుజ్జి గణనాధుని తెచ్చి పూజ చేసుకున్నాను. ఒక్కత్తినే. వారాంతాలు చూసుకుని చవితి రాదు కాబట్టి భోజనం కూడా ఒక్కత్తినే చేయవలసి వచ్చింది. మూడో రోజున నా చేతులతో ఒక బకెట్ నీళ్ళల్లో నిమజ్జనం చేసాక, ఆ నీటిలో కలవలేక రెండు రోజులు బాధ పడ్డ గణపయ్యను చూసాక ఏదో చెప్పలేని వేదన. పండుగ వెనుక పరమార్థం ఇది కాదేమోననే భావన. ఇంటిలో పూజ చేసేసుకుని వీధిలో ఉండే అరడజను మండపాల్లో ఏదో ఒక మండపంలో వినాయకుణ్ణి ఇచ్చేసి 'మమ' అనుకునేస్తే సరి అనే ఆలోచన పోయి, అసలెందుకు ఈ ఆచారం పుట్టింది అనే ప్రశ్న మొదలైన సందర్భం అది. ఇలా స్థాన మార్పు జరిగితే కానీ తెలిసిరాలేదు పండుగల వెనుక మనిషికి – ప్రకృతికీ మధ్య ఉన్న అనుబంధం.

శ్రావణ, భాద్రపద మాసాల్లో వచ్చే వర్షాలకు చెరువులు నిండి దండిగా వ్యవసాయం జరగాలి అనీ చెరువులకు పూడిక తీసి ఆ మట్టితో వినాయకుణ్ణి చేసుకుని పూజించి తిరిగి నీళ్లు నిండిన చెరువుల్లోనే వదిలేవారుట. వ్యవసాయం బాగా జరిగి సంక్రాంతి సమయానికి ధాన్యపు రాశులు నట్టింట

నిలిస్తే, కొత్త వడ్లను దంచి పొంగళ్ళు పెట్టి సంబరాలు చేసుకునేవారుట. అంతా ప్రకృతితో ముడిపడిన చక్రం ఇది. వ్యవసాయ ఆధారిత దేశం కదా అనాదిగా! ఎక్కడో, ఎప్పుడో లెక్క తప్పింది మరి. పండుగ వివరం ఎరుక పరిచే వారు ఎవరు? ఎంతెత్తు విగ్రహాలు పెడుతున్నాము అనే ధ్యాస, ఎన్నేసి నైవేద్యాలు చేస్తున్నాము అనే లెక్కలు తప్పించి ఆవగింజంత భక్తి, పర్యావరణం మీద శ్రద్ధ ఎంత మందికి ఉందనీ?

చవితికి ఐదు నెలల ముందు నుండే ఫోన్లు ఊరి నుండి. "అక్కా! రామాపురం వాళ్ళు 13 అడుగుల విగ్రహం తెస్తా ఉండారు, వంకాయల పల్లి వాళ్ళు కూడా వాళ్ళ కన్నా ఒక్క అడుగు ఎక్కువే తెస్తా ఉండారు. మరి ఈసారి మన పల్లెలో అంతకు మించి పెట్టాల! నువ్వు చెప్పు నీ పేరున ఎంత రాసుకోమంటావో. మైకులో నీ పేరు చెప్పిస్తాము. అమెరికా వాళ్లంటే మాములుగా ఉండ కూడదు మరి " అని గుక్కతిప్పుకోకుండా ఒకటే హడావిడి. అప్పుడే 'తరిగొండ రాచపల్లి గణేష్ యూత్' అనే వాట్సాప్ గ్రూప్ లో మెంబెర్ ని కూడా చేసేసారు. "ఒరేయ్ వద్దురా … అసలు పండుగ చేసేది ఫలానా దానికి రా, ఆ డబ్బు ఊర్లో ఇంకోదానికి వాడదాము" అని చెప్తుంటే వింటేనా!

ఒకసారి ఇలాగే మొహమాట పెట్టి 'అమెరికా వాళ్ళు' అన్న పేరున బాగానే గుంజారు. (ఇక్కడ పెరట్లో చెట్టుకి డాలర్లు కాస్తాయిగా మరి.) తీరా చూస్తే రికార్డింగ్ డాన్సు, తీన్మార్లతో పల్లెలో తొమ్మిది రోజులు ఎవ్వరికి శాంతి లేకుండా చేసారుట. నాలుగు ఆవులు కట్లు తెంపుకుని పారిపోయాయిట. అంత హంగామాతో కొన్న విగ్రహాన్ని వర్షాలు లేక నెర్రెలు చీలిన చెరువుల్లో ఎండకు, గాలికి వదిలేసి ఎవరి దారిన వారు చక్కా పోయారుట. పెద్దవాళ్ళు ఒకటే గోల. పిల్లలేమో పట్నాలకి చదువులకి వెళ్లి పండగలకి ఊర్లకి వచ్చి 'చంటిగాడు లోకల్' అనే వేషాలు. మొన్న యూట్యూబ్ పోల్ లో 'ఇండిపెండెన్స్ డే' కి 'రిపబ్లిక్ డే' కి తేడా అడిగితే మూడొంతుల మంది యువత తెల్ల మొహం వేసారు. ఇక వీరి సోషల్ రెస్పాన్సిబిలిటీ గురించి ఆలోచించేది ఏముంది. దేశంలో యువత ఇంత సొంపుగా ఉంటే ఎలాగా? ఊర్లో వీళ్ళ నిర్వాకం తెలిసి చందాలు ఆపేసిన వాళ్ళు 'లోభులు.' ఒక్కొక్క తలకి నాలుగేసి ఓట్లు అని లెక్కలేసి వీళ్ళ ఆటలు సాగనిచ్చే 'సర్పంచ్ ' కాండిడేట్లేమో హీరోలు. ఎక్కడికక్కడ గ్రామస్థాయి నుండీ రాజకీయాలే! రేపటి గురించి, రాబోయే తరాల గురించి లెక్కలేనితనం. ఇదీ అమాయక గ్రామీణ భారత పండుగ శోభ.

ప్రపంచం నలుమూలలా ఏ సంబరం చూసుకున్నా ప్రకృతితో ముడివేసుకున్నవే. ప్రకృతి మనకి ప్రసాదించిన గాలీ, నీరు, ఆహారానికి బదులుగా కృతజ్ఞతతో చేసుకునే వేడుకులే. మాములుగా ఈ విషయాన్ని చెప్తే వినమని కాస్త భయమూ, భక్తీ కలగలిపి చెప్తే ఎవరం పాటిస్తున్నాము కనుక? ప్రతి దేవునికి ఒక జంతువుని వాహనంగా ఇచ్చారు, వారి మీద భక్తితో అయినా ఏమి చెయ్యకుండా వదిలేస్తామని. మొన్న చిన్నదాన్ని 'జూ' కి తీసుకుని వెళ్లి సింహాన్ని చూపించి 'చూడు చూడు అదుగో సింహం ' అని ఎక్సైట్ అయ్యాను. కాసింత స్థలంలో తాపీగా కూర్చుని గాజు తలుపుల నుండి 'ఒక్క చూపు,' క్షణ కాలం చూసింది నన్ను. ఎంత ఈసడింపు ఉందో ఆ సింహపు చూపులో. దాని స్థావరానికి వెళ్లి అదే ఎక్సయిట్మెంట్ తో నేను అరవగలనా అనిపించింది. గొంతులో ఏదో అడ్డుపడగా ఎన్నో విషయాలలానే ఈ ఆలోచన కూడా విదిలించేసి పక్కనే వున్న ఇంకో బోనులో జీవి దగ్గరికి వెళ్ళాను. చలి చీమలనుండి, వాన పాముల వరకు అన్ని జంతువులు 'పర్యావరణ సమతుల్యత' కోసం రేయింబవళ్లు పాటు పడతాయని చెప్తే విని బుర్రకెక్కించుకోము కదా. ఇంత 'అహం' ఎందుకు మనిషికి?

ఇహ పుట్టిన నేలన యురేనియం నిల్వల కోసం నల్లమల అడవులని తవ్వడానికి అనుమతినిచ్చిన ప్రభుత్వాన్ని చూస్తే 'యధా ప్రజా … తధా రాజా' అనాలేమో! మనది ప్రజాస్వామ్యం కదా. అనాదిగా ఆ అడవుల్లో భాగంగా వున్న చెంచులు ఇతర ఆదివాసీలు ఎక్కడికి వెళ్ళాలి? జంతువుల సంగతి సరే సరి. వాటి రోదన వినడానికి అరణ్యాలు కూడా లేకపోతే ఎలా? చీమలు దూరని చిట్టడవి, కాకులు దూరని కారడవి అనేవి పుస్తకాల్లో మిగిలిపోవలసిందే ఇక. ఊర్లో ఎకరం నేల తడపడానికి వేల అడుగుల్లో భూమిని తోడాల్సివస్తోంది. ఇటువంటప్పుడు అడవులని నరకివేయడం అనేది ఎంత అనాగరికం! ఇదేం పురోగతి. నదుల గతులు తప్పితే వచ్చే అనర్థాలు ఊహించగలమా?

ఇటు చూస్తే తగలబడుతున్న అమెజాన్ అడవులు. మొత్తం ప్రపంచానికి కావలసిన ప్రాణ వాయువులో 20% అమెజాన్ అడవుల్లోంచే వస్తోంది. భూమికి ఊపిరి తిత్తులుగా పిలవబడే అడవులు తగలబడిపోతున్నాయ్. అదీ మానవ తప్పిదం వలన. ఇదేనా ప్రకృతి పట్ల మనకున్న శ్రద్ధ. ఇంత శ్రద్ధలేని వాళ్ళము మనం పండుగలు జరుపుకోడానికి అర్హులమేనా అసలు? కట్టుకునే చీరలకు, నగలకు, నైవేద్యపు ఫోటోషూట్లకు లైకులు వస్తాయి కానీ ఫలం దక్కుతుందా అని నా అనుమానం.

అయినా పుట్టుకతో వచ్చిన నమ్మకాలని వదలలేము కదా. ఏదో ఒక నమ్మకం / విశ్వాసం లేనిదే మనిషి జీవనం సాగించలేడు. ఆ విశ్వాసాన్ని క్రమబద్ధీకరించి పాజిటివ్ ఎనర్జీని పంచడమే ఏ ధర్మమైనా చేసేది. అసలు తత్వాన్ని వదిలేసి చేసుకునే సంబరాల్లో, చిత్తశుద్ధి లేని ఈశ్వర పూజ లాగా ఫలం ఏమీ ఉండదు. మనుషులతో పాటు జీవించే హక్కు జీవం ఉన్న ప్రతి దానికి ఉంది ఈ భూమ్మీద. అది తెలుసుకుని చేసుకునే పండుగల్లో వచ్చే పాజిటివ్ పవర్ ఎంతో జీవశక్తిని ఇస్తుంది. కాకపోతే ఒక్కటి, చిన్ననాటి ఆనందాలను, సంబరాలను పిల్లలకి కూడా పంచాలి. పండుగలంటే కొత్తబట్టలు, దేవుడికి ఇంకొన్ని అర్జీలు, 'ధన కనక వస్తు వాహన ప్రాప్త్యర్థం' మాత్రమే కాదు అని చెప్పాలి. ఈ పసి మొక్కలని ఇప్పుడే మలచాలి. వారిని మార్చగలం. వారికి ప్రకృతిని పరిచయం చేయగలం. వారికి పండగలకి ఆచారాలకీ ప్రకృతితో గల సంబంధం వివరించాలి. అది మనిషి కన్నా గొప్పదైన శక్తి అనీ, దానికి కృతజ్ఞులమై ఉండాలని చెప్పాలి. అదే మనం చేసుకోగలిగే పెద్ద పండుగ.

*(వచ్చే నెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments